# భర్తలూ భయపడతారా?

"పెద్ద పెద్ద బొద్దు మీసాలు! ఆ మీసాలమీద నిమ్మకాయని నిలబెట్టవచ్చు! ఆరడుగుల పొడుగూ, పొడవుకు తగ్గ లావూ అతనిని చూడగానే 'ఆజానుబాహుడు' 'గంభీరవదనుడు' లాంటి మాటలు గుర్తుకొస్తాయి కదూ!" పక్కవాటాలో వున్న పంకజాక్షి మొగుణ్ణి గురించి వర్ణించింది సంగీత!

"అవును! పులిలా వుంటాడు" అంది మరో వాటాలో వున్న అరవింద.

సంగీత పకపకా నవ్వింది.

"ఎందుకలా నవ్వుతున్నావ్?" అడిగింది అరవింద.

"పులికాదు పిల్లి?" మళ్లీ నవ్వింది సంగీత.

"ఏమిటీ నువ్వంటూన్నది? భూమి దద్దరిల్లేలా బూట్లు టకటక లాడిస్తూ మీసాలు మెలేసుకుంటూ నడుస్తాడు. ఆయన్ని గబుక్కున చూస్తే నాకేభయమేస్తుంది. అటువంటి మనిషిని పట్టుకుని పిల్లంటావేమిటి?" అంది అరవింద ఆశ్చర్యంగా కళ్లు తిప్పుతూ.

"బయట పులే! సందేహం లేదు. కాని పాపం భార్యముందే పిల్లి" అంది సంగీత. ఈసారి సంగీత మెల్లగా అరవింద చెవిలో రహస్యం చెబుతున్నట్టుగా దగ్గరగా జరిగి అంది.

"నీకెలా తెలుసే అతను ఇంట్లో పిల్లి అని?" అడిగింది అరవింద.

"ఇంట్లో వాళ్లావిడ పెద్దపులి. ఆవిడకి చచ్చే అనుమానంట. ఆయనతో పదేళ్లపాప దగ్గరనుంచి యాభై ఏళ్ల ఆవిడదాకా ఎవరు మాట్లాడినా అనుమానంతో బాధపడిపోయి ఒక్కొక్కసారి ఆ వొచ్చిన వాళ్ల మొహాన్నే ఏదో ఒకటి వాళ్లు బాధపడేలా అనెయ్యడమో, లేకపోతే వాళ్లు వెళ్లిపోయాక ఇహ ఇతణ్ణి దుయ్యబట్టడమో చేస్తుందట. ఆ నోటికి భయపడి ఆయన పిల్లిలా ఆడ గాలి సోకకుండా తన లోకంలో తను చదువుకుంటూ ఏదో పుస్తకం తీసుకుని కూర్చుంటాడుట." అంది సంగీత.

"మా పనిమనిషి రాములమ్మ చెప్పింది. అది కొన్నాళ్ళు వాళ్ళింట్లో పనిచేసిందటలే! అది గది తుడుస్తూ ఉంటే ఆయనక్కడవుంటే అనుమానపడేదిట! తను చేస్తున్న పని ఒదిలేసి రాములమ్మ గది ఊడ్చడం అయిపోయేదాకా అక్కడే నిలబడేదిట. లేకపోతే వెంటనే ఏదో పనున్నట్టు అతణ్ణి కేకేసేదిట! మొదట్లో దీనికి అర్థం కాలేదుట కానీ, ఒకరోజున అది పని పూర్తిచేసుకుని వెళ్ళిపోతున్నానని చెప్పి బయలుదేరి వెళ్ళిపోయిందట. పోతూ పోతూ తను ఇంటినుంచి తెచ్చుకున్న నూనెడబ్బా ఖాళీది నూనె కొనుక్కెళ్ళాలని తెచ్చుకుందట! దాన్ని అక్కడ వదిలి మర్చిపోయి వెళ్ళిపోయిందట, సగం దూరం వెళ్ళాక జ్ఞాపకం వచ్చి తిరిగి వెళ్ళిందట. అప్పటికి ఆ ఇంట్లో యుద్ధం జరుగుతోందట.

అతను తల కొట్టుకుంటూ "బయటి వాళ్ళతో నవ్వుతూ మాట్లాడకపోతే ఏడుస్తూ మాట్లాడమన్నావా? ఇదుగో సుశీలా! ఒక్కటి గుర్తుంచుకో! నిజంగా నేను చెడ్డవాణ్ణే అయితే, తిరుగుబోతునే అయితే ఇలా ఆరోగ్యంగా వుండను అంతేకాదు! ఇంట్లోంచి బయటపడ్డాక నాక్కావలసిన వాళ్ళతో నేను తిరగ్గలను! నువ్వు ఆపగలవా? ఇంకావిను! నిజంగానే నేనటువంటి వాణ్ణయితే నీ మొహం కూడా చూసేవాణ్ణి కాదు. నీతో సవ్యంగా కాపురం చేస్తున్నానంటే నాకు ఎటువంటి అలవాట్లు లేవని తెలీదూ? మొరిగే కుక్క కరవదంటారు? ఇలా సరదాగా మాట్లాడేవారు ఏమీ చెయ్యరు. నిజంగా వెధవ పన్లు చేసేవాళ్ళు చెప్పరు. ఇంకో విషయం కూడా జ్ఞాపకం పెట్టుకో! నీకెలా నీతి నియమాలున్నాయో ఇతర ఆడవాళ్ళకీ అలాగే వుంటాయి. ఏ ఆడదీ తన సంసారం కాదని తేరగా కూర్చోదు పిలవగానే రావడానికి. సభ్యత నేర్చుకో!"

"ఇన్ని మాటలన్న మీరు ఎన్ని పన్లయినా చెయ్యగలరు! మీ మగాళ్ళని నమ్మకూడదు"

"మరి నువ్వు ఎవరితో మాట్లాడినా నేను అనుమానించనే ఎందుచేత? సంసారం అనుమానాలతో నడవదు. అభిమానంతో నడుస్తుంది. నమ్మకాలతో నడుస్తుంది".

మైగాడ్! ఇలాంటి భార్యలుంటే వారిపని గో...విం...ద! పిచ్చికానీ, భర్త

తన గురించి ఎంత ఆలోచిస్తున్నాడూ, తనతో ఎలా వుంటున్నాడూ అని గ్రహించయినా ఇటువంటి పిచ్చి పిచ్చి అనుమానాలు మానొచ్చుగా! ఆడవాళ్లకి అసూయ పుట్టిల్లంటారు. అదొక్కటే కాదు, అనుమానం కూడా వారిసొత్తే! పిచ్చి పిచ్చి ఊహలతో నిక్షేపంలాంటి కాపురాలు పాడుచేసుకోక సంసారం సుఖమయం చేసుకోవడం ఆడదాని చేతిలో వుంది. అయిన దానికీ కానిదానికీ అపార్థం చేసుకుని అతనిని తన కొంగుకి బంధించాలని తాపత్రయపడడం కన్నా ప్రేమతో, గౌరవాభిమానాలతో మగవాడిని తన మనస్సుతో బంధించడానికి ప్రయత్నిస్తే జీవితం సుఖమయమవుతుంది. ఆ సంసారం భూతల స్వర్గంలా వుంటుంది కదూ?" అంది అరవింద.

"అవును లేకపోతే భర్తలు భార్యలంటే భయపడిపోయి ఇంటికి దూరంగా వుండడానికి ప్రయత్నిస్తారు" అంది సంగీత జంతికలు నములుతూ. పిల్లలు స్కూళ్లనుంచి తిరిగి రావడంతో సంగీత వెళ్లిపోయింది. సంభాషణలు కట్టిపెట్టి!

*